# హోరు

– జి.పి. కిరణ్

ఇంట్లో అందరూ హడావుడిగా ఉండటంతో ఏమిటా విశేషం అని ఆలోచించారు రామ్మూర్తిగారు. ఎంత ఆలోచించినా ఆయనకి విశేషం ఏమిటో అంతు పట్టలేదు. కాస్సేపటికి తనగదివైపు వచ్చిన మనవడు శ్రీకాంత్‌ని తన దగ్గరకు రమ్మన్నట్లుగా సైగ చేసారు. వాడు ఏమూడ్‌లో ఉన్నాడోగానీ పిలవగానే తాత దగ్గరకు వెళ్ళి మంచం మీద కూర్చున్నాడు.

''ఏమిట్రా ఇంట్లో హడావుడిగా ఉంది. ఎవరైనా వస్తున్నారా?'' మనవడ్ని దగ్గరకు తీస్కుని అడిగారు రామ్మూర్తిగారు.

''ఎవరూ రావట్లేదు తాతయ్యా. మేమే ఊరువెళుతున్నాం.'' చెప్పి జారుకోబోయాడు.

''అరె అడిగినదానికి బదులివ్వకుండా వెళ్ళిపోతావేరా?'' అంటూ వాడ్ని గట్టిగా పుచ్చుకున్నారు.

శ్రీకాంత్ తాత మొహంలోకి చూసాడు. చెవులవైపు చూసాడు. అక్కడ ఉండవలసింది లేదు. వాడికి అర్థమైంది. తను చెప్పింది తాతకు వినపడలేదు అని. వెంటనే ప్రక్కలకు చూస్తే తలగడ ప్రక్కన పదిలంగా పెట్టి ఉన్న చెవిటి మెషిన్ కనిపించింది. దాన్ని తీసి తాత చెవికి తగిలించి అప్పుడు చెప్పాడు. ''తాతయ్యా మన ఇంటికి ఎవరూ రావట్లేదు. మేమే ఊరికి వెళుతున్నాం.''

''అలాగా! మీరే వెళుతున్నారా? నన్ను తీసుకువెళ్ళటంలేదా?''

''లేదు తాతయ్యా! నువ్వు ముసలాడివి కదా. అందుకని నడవలేవని నిన్ను తీసుకువెళ్ళడంలేదు. డాడీ చెప్పారు. మమ్మీ, డాడీ, తమ్ముడు, నేను నలుగురం వెళుతున్నాం. నీకు అన్నం వండిపెట్టమని మన పనిమనిషికి డాడీ చెప్పారు.''

రామ్మూర్తిగారి మనస్సు చివుక్కుమంది. వాడి మాటలకు మాత్రం కాదు. ప్రయాణం సంగతి తనకు చెప్పకుండా తన పరోక్షంలోనే అన్నీ నిర్ణయించేసుకుంటున్న కొడుకు, కోడలి మనస్థత్వాలకు. కనీసం తనతో చూచాయిగా చెప్పి, మాటవరసకి రమ్మన్నా తను ఎంతో సున్నితంగా రాలేనని చెప్పి ఉండేవాడు. తనకు మాత్రం తెలియదా ప్రయాణంలో వారికి భారంగా ఉంటానని! వీళ్ళు ఎందుకు గ్రహించలేకపోతున్నారీ చిన్న చిన్న విషయాల్ని.

''ఇంతకీ ఏ ఊరు వెళుతున్నారా?''

''భువనేశ్వర్ తాతయ్యా!''

అది వింటూనే ఉలిక్కిపడ్డారు రామ్మూర్తిగారు. సరిగా విన్నానో లేదో అనుకుని చెవి దగ్గర మెషిన్‌ని ఓసారి సరి చేసుకుని మళ్ళీ అడిగారు. తిరిగి వాడు అదే సమాధానం చెప్పాడు.

''ఎందుకురా ఆ ఊరు వెళ్ళటం? అక్కడ మనకి బంధువులు కూడా ఎవరూ లేరే!'' ఆయనకి చాలా ఆశ్చర్యంగా ఉంది.

''అక్కడ నాన్నకి ఆఫీసు వర్క్ ఉందట. ఎలాగూ మాకు కూడా సెలవులే కదా! అందుకని అందరు వెళుతున్నాం. తాతయ్యా! అక్కడ చూడటానికి చాలా ఉన్నాయండి. కోణార్క్‌లో సూర్యదేవాలయం, పూరీలో జగన్నాధస్వామి టెంపుల్, ఇంకా అక్కడ బీచ్ కూడా ఉందట. బీచ్ చాలా బాగుంటుంది కదూ తాతయ్యా!''

''అవున్రా బీచ్ చాలా బాగుంటుంది. చాలా చాలా బాగుంటుంది'' ఆయన కళ్ళముందు తన యవ్వనం తొలిరోజుల్లో అక్కడ సంధ్యతో కలిసి ఆడిన ఆటలు, చెప్పుకున్న ఊసులు, చేసుకున్న బాసలు అన్నీ కదలాడసాగాయి. తాతయ్య ఆలోచనల్లో పడటంతో ప్రశాంత్ మెల్లగా అక్కడ్నుంచి జారుకున్నాడు. రామ్మూర్తిగారికి ఒక్కసారిగా జ్ఞాపకాల తుట్టెని కదిల్చినట్లయింది. నెమ్మదిగా మంచం దిగి గది బైటకు వచ్చారు. కొడుకు కాళ్ళకి షూ వేసుకుంటూ కనిపించాడు. కోడలు వంటగదిలో ఉన్నట్లుంది.

నెమ్మదిగా కొడుకు దగ్గరకు వెళ్ళి ''ఏరా ప్రసాద్ భువనేశ్వర్ వెళుతున్నారటగా...'' అని అడిగారు.

తండ్రివైపోసారి చూసి తిరిగి తన పని కంటిన్యూ చేస్తూ ''అవును నాన్న రాత్రికి వెళుతున్నాం. నాకు అక్కడ ఆఫీసు పని ఉంది. పిల్లలకెలాగూ సెలవులే కదా. అందుకని వారిని కూడా తీసుకువెళుతున్నాను.''

''నేను కూడా వస్తారా. నాకు అవి అన్నీ మరోసారి చూడాలని ఉంది.''

''నువ్వా! ఎందుకు నాన్నా అంత శ్రమ. అదేమైనా దగ్గర ఉందా. అయినా మేము అక్కడ ఎక్కువరోజులు ఉండటానికి వీలు కూడా లేదు. వెళ్ళి వెంటనే రెండు, మూడు రోజుల్లో తిరిగి రావాలి.''

''మీతోపాటే నేను కూడా. కాదనకురా.'' ఆయన గొంతులో అభ్యర్థన ధ్వనించింది.

ఇంతలో కోడలు అక్కడకి వచ్చి ''మీరెందుకు మావయ్య, పిల్లలతోటే చాలా ఇబ్బంది. ఇక మీరు కూడా వస్తే కష్టంగా ఉంటుంది. అయినా మీకు ఇంట్లో ఇబ్బంది కలుగకుండా ఉండటానికి మన పనిమనిషికి అన్నీ చెప్పాను. వేళకి భోజనం, మందులు సమకూరుస్తుంది.''

''ఇక్కడ ఇబ్బంది పడతానని, మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని మీవెంట వస్తాననటం లేదమ్మా. నాకు ఆ ప్రదేశాలు చూడాలని మనసు తహ తహలాడుతోంది. మరో ఊరు అయితే నేను వస్తానని అనేవాడ్ని కాదు.''

''ఎన్నయినా చెప్పండి మావయ్య. మీరు రావటం అంత మంచిదికాదు. మీరు ఇబ్బందిపడి మమ్మల్ని ఇబ్బందిపెట్టి అక్కడి విశేషాలు చూడవలసిన అవసరం లేదుకానీ, మీరు చక్కగా ఇంట్లో ఉండండి. రెండు రోజుల్లో తిరిగి వచ్చేస్తాం'' అని వంటగదిలోకి వెళ్ళిపోయింది కోడలు.

కొడుకువైపు చూసారు రామ్మూర్తిగారు. తన నిర్ణయం కూడా అదే అన్నట్లుగా మౌనంగా బైటకు వెళ్ళిపోయాడు ప్రసాద్. నెమ్మదిగా తన గదిలోకి వచ్చారు రామ్మూర్తిగారు. మంచం క్రింద ఉన్న ఒక పాత చెక్క పెట్టెని బైటకు లాగారు. అది తెరచి అందులోంచి ఒక పాత ఆల్బమ్‌ని బైటకు తీసారు. మరల పెట్టెని లోనికి తోసి మంచం మీద కూర్చున్నారు. ఆల్బమ్‌ని పట్టుకున్న ఆయన చేతులు వణకసాగాయి. నెమ్మదిగా ఒకో ఫోటోని చూస్తూ తనకి కావలసిన ఫోటో రాగానే అప్రయత్నంగా కళ్ళజోడు సరిచేసుకున్నారు. ఆ ఫోటోలో ఒక యువకుడు, ఒక యువతి ఉన్నారు. తను, సంధ్య, ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాల్ని చూస్తూ భయంతో నిలబడిపోయిన సంధ్యని గట్టిగా పట్టుకుని కెరటాల వైపు తీసుకువెళుతున్న దృశ్యం. ఎన్ని సంవత్సరాలు గడిచినా ఇంకా అది సజీవ దృశ్యంగానే ఉంది. రామ్మూర్తిగారికి ఆ జ్ఞాపకాలు అన్నీ కళ్ళముందు కదలాడసాగాయి. ఆ అలల హోరు మరల చెవుల్లో ప్రతిధ్వనించసాగింది.



పెళ్ళయిన కొత్తలో సంధ్యని తీసుకుని భువనేశ్వర్ వెళ్ళాడతను. విహార యాత్రకని కాదు. దగ్గరి బంధువు ఒకాయన అక్కడ ఉద్యోగం చేసేవాడు. చాలా అభిమానంగా ఉండేవాడు. తమ ఇంటికి రమ్మని మరీ మరీ ఉత్తరాలు రాయడంతో ఒకసారి వీలుచూసుకుని ప్రయాణమయ్యారు. రెండురోజులు అటూ ఇటూ తిరిగాక మూడవరోజున పూరీ జగన్నాధస్వామి ఆలయానికి ప్రోగ్రాం పెట్టుకున్నారు. ఆ రోజున తన బాబాయ్‌కి ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఉండటంతో ఆయనకి, వంట్లో నలతగా ఉండటంవలన పిన్నికి తమతో రావటానికి వీలుపడలేదు. ఇక విధిలేక ఇద్దరే బయల్దేరారు సాయంత్రానికి వస్తామని చెప్పి.

జగన్నాధస్వామి దర్శనం చేసుకున్న తర్వాత బీచ్‌కి వెళ్ళారు. అక్కడ ఎగిసి పడే అలల్ని చూసినాక మదిలో హుషారు రెట్టింపయింది. మొదట ఆ హోరు భయం కల్గించినా కాస్సేపటికి అది ఎంతో హాయిగా అనిపించింది. ఆడారు, పాడారు, తడిచారు. అల వచ్చినప్పుడు కాళ్ళక్రింద జరిగిపోయే ఇసుక వారికి ఆశ్చర్యంగా తోచింది. 'రామూ' అంటూ ఆనాడు తన చెవిలో ఎన్ని చిలిపిమాటలు చెప్పిందని. చీకటిపడేవరకూ తమకు ఏవీ జ్ఞాపకం రాలేదు. అక్కడ జ్ఞాపకాల్ని పోగుచేసుకోవటం తప్ప. అలల తాకిడికి తడిసిపోయిన చీరని ఆరబెట్టుకోవటానికి సంధ్య పడిన తంటాలు, ఆమెని అల్లరి పెట్టాలని కెరటాల వైపుకి లాక్కువెళ్ళటం ఏవీ స్మృతిపథంలోంచి బైటకు పోలేదు. తను, సంధ్య సముద్రాన్ని చూడటం అదే మొదటి సారి, చివరిసారి కూడా.

ఆ జ్ఞాపకాలు మినహా మరేమీ మిగల్లేదు తన జీవితంలో. అక్కడ్నుంచి వచ్చినాక ప్రసాద్‌ని ప్రసవించి చనిపోయింది సంధ్య. ఆమెతో తను గడిపిన వైవాహిక జీవితం చాలా తక్కువ. ఆమె జీవితంలో గుర్తుంచుకోదగిన మధురక్షణాలు ఉంటే అవి ఆ బీచ్‌లో గడిపిన క్షణాల్ని చెప్పుకోవచ్చు. ఆ తర్వాత కాలంలో తనకి అటువైపు వెళ్ళడం కుదరలేదు. తన బాబాయ్ వాళ్ళు కూడా ఇక్కడికే వచ్చేసారు. గతం గుర్తుకు రావటం వలన ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాటిని తుడుచుకుని ఆల్బమ్‌ని పెట్టెలో సర్దేశారు. 'ఏది ఏమయినా సరే తనూ వీళ్ళవెంట వెళ్ళితీరాలి' అన్న నిర్ణయానికి వచ్చారాయన.

తన గదిలోకి అన్నం తీసుకువచ్చిన కోడలితో 'వద్ద'ని చెప్పారు. మాట్లాడడం మానివేసారు. ఆయన నిరాహారదీక్ష, మౌనవ్రతం పని చేసాయి. రామ్మూర్తిగారిని తమతో తీసుకు వెళ్ళటానికి కొడుకు, కోడలు ఒప్పుకున్నారు.

• • •

భువనేశ్వర్‌లో ట్రైన్ దిగినప్పటి నుంచి ఆయనకు ఉత్కంట ఎక్కువైంది. అక్కడ లాడ్జిలో రూమ్ తీసుకున్నారు. ఆరోజంతా ప్రసాద్‌కి ఆఫీసు పనితోనే సరిపోయింది. మరుసటిరోజు 'కోణార్క్ వెళదా'మన్నాడు ప్రసాద్. కాదు పూరీ వెళ్ళాలని రామ్మూర్తిగారు పట్టుబట్టటంతో పూరీకి బయల్దేరారు. పిల్లల్ని తయారు చేసి బైటపడేసరికి దాదాపుగా మధ్యాహ్నం అయింది. ఈకాస్సేపటిలో రామ్మూర్తిగారు పడ్డ కంగారు అంతా, ఇంతా కాదు. వారందరికీ చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆయనంతగా ఎందుకు ఆతృత పడుతున్నాడాఅని. భువనేశ్వర్ నుంచి టౌన్‌బస్‌లో పూరీకి ప్రయాణం. బయల్దేరినప్పుడే ఆయనకు అనుమానం వచ్చింది.

కొడుకుతో చెపితే విసుక్కుంటాడేమోనని చెప్పలేదు. పూరీ చేరుకుని అక్కడ జగన్నాధస్వామి

## కిడ్నాప్ తర్వాత...



సెక్సీణి మమతా కులకర్ణి కిడ్నాప్ వార్త బాలీవుడ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసిందని చెప్పొచ్చు. ఆమెను కిడ్నాప్ చేయాలనుకోవడానికి కారణాలెలావున్నా ఆ వార్త మమత మీద కాస్త సింపతీని క్రియేట్ చేసింది. ఈ సింపతీ ఆమె భవిష్యత్తుకు ఉపయోగపడేలానే వుంది. ఎలాగంటే, మమత మీద ఏర్పడిన ఈ సింపతీ తమ సినిమాలకు కాస్త ప్లస్ అవుతుందేమోననుకుంటున్నారు బాలీవుడ్ నిర్మాతలు. అందుకే మమత వున్న సినిమాలు తొందరగా పూర్తిచేసి రిలీజ్ చేయాలని కొందరు ప్లాన్ చేస్తున్నారట. ఖాళీగానే వున్న మమతను తమ సినిమాలో నటింపచేయాలని మరికొంతమంది నిర్మాతలు ఆల్రెడీ ప్రయత్నాలు ప్రారంభించేసారు... అయితే మరో వర్గం నమ్మకం ఏమిటంటే, మమత కిడ్నాప్ తతంగం వెనుక మాఫియా ఉండొచ్చేమోనని! అప్పట్లో మమత తనకు చీకటి ప్రపంచ చక్రవర్తులతో పరిచయం వుంది అని చెప్పుకునేది. ఒకవేళ అదే నిజమయితే నష్టం మమతకే!

- జె.వి. బాబు


దర్శనం చేసుకుని ఆటోలో బీచ్‌కి బయల్దేరారు. అప్పటికి సాయంత్రం అయింది. ఆటోలో కూర్చున్న కాస్సేపటికి రామ్మూర్తిగారి అనుమానం నిజం అయింది. జేబులో ఉన్న మెషిన్‌ని బైటకు తీసి విదిలించారు. సెల్స్ బైటకు తీసి మరల బిగించారు. ఊహు.. లాభంలేదు. చెవిలో ఉన్న ఇయర్ ఫోన్‌ని అటునుంచి ఇటుకి మార్చారు. అయినా ప్రయోజనంలేదు. బ్యాటరీ అయిపోయింది. కొడుకు, కోడలు, పిల్లలు ఏదో మాట్లాడుకుంటూ, నవ్వుకుంటున్నారు. తనకేమీ వినపడడంలేదు. నెమ్మదిగా కొడుకు మీద చేయి వేసారు. 'ఏమిట'న్నట్లు చూసాడు ప్రసాద్.

నెమ్మదిగా గొంతు పెగల్చుకుని ''దీనిలో బ్యాటరీ అయిపోయిందిరా. ఇక్కడెక్కడైనా...''

''ఇప్పుడు నన్ను దానికోసం ఊరిమీద పడమంటారా? అది పనిచేయకపోతే వచ్చే నష్టం ఏమీలేదు కానీ, తర్వాత వేయించుకోవచ్చులే!''

కొడుకు ఏమన్నాడో వినపడలేదుకానీ, విసుక్కున్నాడని మాత్రం అర్థమైంది. మారు మాట్లాడలేదు. ఆటో బీచ్‌కి చేరుకుంది.

ఆటో దిగిన రామ్మూర్తిగార్కి ఎదురుగా ఉవ్వెత్తున ఎగసిపడుతున్న తరంగాల్ని చూస్తున్నకొద్దీ ఉత్సాహం రెట్టింపవసాగింది. అందరికంటే ముందుగా అలల దగ్గరకి చేరుకున్నారు. కాళ్ళ దగ్గరకి వచ్చిన నీటిని వంగి దోసిట్లోకి తీసుకున్నారు. నీటి మధ్యన ఇసుక రేణువులు కనిపించాయి. పారవేయబోయారు. ఆ నీటిలో సంధ్య రూపం నవ్వుతూ కనిపించింది. ఆ నీటినలాగే మొహం మీద జల్లుకున్నారు. పెదవులకి ఉప్పుగా తగిలాయి. ఆ ఉప్పదనం ఈ నీటిదా? కన్నీటిదా? అర్థమవలేదు. కొడుకు తనకు జాగ్రత్తలు చెప్పి భార్య ఉన్నవైపుకి వెళ్ళాడు. అతడేం చెప్పాడో రామ్మూర్తిగారికి వినపడలేదు. పిల్లలు అప్పుడే ఆటల్లో పడ్డారు. రామ్మూర్తిగారు పదిలంగా తన వెంట తెచ్చుకున్న ఫోటోని జేబులోంచి బైటకు తీసారు. పరీక్షగా దానివైపే చూస్తున్న ఆయనలో అంతర్వాణిలా హోరు వినిపించసాగింది. ఫోటో మీద నుంచి దృష్టి పక్కకు మరల్చారు. దృశ్యం తప్ప శబ్దం లేదు.




బలమైన కెరటాలు చాలా ఎత్తుగా వస్తున్నాయి. చివరికి బలహీనపడి వెనుదిరిగి వెళ్ళిపోతున్నాయి. చుట్టూ చూసారు. ఆనాడు సంధ్యతో తను గడిపిన ప్రతి ప్రదేశం గుర్తుకు రాసాగింది. ఆ ఇసుకలో కూర్చున్నారు. అక్కడంతా చేతితో స్పృశించారు. సంధ్య తన చెవిలో 'రామూ' అని పిలుస్తున్నట్లుగా అనిపించింది. పౌర్ణమి రోజులు కావటంతో కెరటాలు చాలా ఉధృతంగా వస్తున్నాయి. చీకటి పడింది. పున్నమి చంద్రుడు ఆకాశంలోకి వచ్చాడు. సముద్రం మీద వెన్నెల పరుచుకుంది. రామ్మూర్తిగార్కి ఈ దృశ్యాలేవీ ఆనందం కలిగించటంలేదు. ఇంకా దేనికోసమో మనసు ఆరాటపడుతోంది. ఆయనలా ఉండగానే కెరటం ఒకటి వచ్చి ఆయన్ని నిలువునా తాకింది. అది తాకేవరకూ ఆయన దానిని గమనించలేదు. అప్పుడు అర్థమైంది తనలోని అసంతృప్తికి కారణం. వినపడని ఆహోరు మనసులో అశాంతిని కల్గిస్తోంది. జేబులోని మెషిన్‌ని బైటకు తీసి అటూ, ఇటూ ఊపి చూసారు పని చేస్తుందేమోనన్న ఆశతో. లాభంలేదు. విసుగ్గా దాన్ని సముద్రంలోకి విసిరేసారు.

బయటేకాదు, ఆయనలో కూడా అలజడి. అది క్షణ, క్షణానికీ పెరగసాగింది. దాన్ని వినాలి. వెళ్ళేలోపు వినాలి. జేబులోంచి ఫోటో తీసి మరల చూసారు. మళ్ళీ అంతర్వాణిలా చిన్నగా హోరు మొదలైంది. దాన్ని జేబులో పెట్టేసుకున్నారు. అది సద్దుమణిగింది. ప్రసాద్ వచ్చి 'బయల్దేర'మన్నాడు.

''ఇంకాస్సేపు ఉందాంరా. నేను ఆ హోరు వినాలి.''

ప్రసాద్‌కి అర్థంకాలేదు. ''ఏం వినాలి?'' కొడుకు చేసిన సైగతో ప్రశ్న అర్థం చేసుకున్నారు.

''హోరు!''

ప్రసాద్‌కి కాస్సేపు అర్థంకాలేదు. తర్వాత ''విన్నది చాలు. ఇప్పటికే చాలా లేటయింది పద. చిన్నపిల్లాడిలా బట్టలన్నీ ఎలా తడుపుకున్నావో చూడు'' చెయ్యి పట్టుకుని ముందుకు తీసుకుపోయాడు. తర్వాత రామ్మూర్తిగారి చేయి వదిలి పిల్లల్ని పట్టుకున్నాడు. వారంతా ముందు నడుస్తుంటే వెనకాల రామ్మూర్తిగారు వెనుదిరిగి చూస్తూ నడుస్తున్నారు. ఆయనలో అశాంతి మరింతగా పెరిగిపోసాగింది. ఎగసిపడే కెరటాలు 'మా సడి వినకుండానే వెళ్ళిపోతావా?' అని ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించింది.

ఒక్కసారిగా వెనుదిరిగి కెరటాలకు ఎదురు పరుగెత్తడం ప్రారంభించారు. ప్రసాద్ వెనక్కి తిరిగి 'వెళ్ళవద్ద'ని కేకలు వేయసాగాడు. రామ్మూర్తిగార్కి అంత శక్తి ఎలా వచ్చిందో అర్థంకాలేదు.

అలా పరుగెడుతూనే వెనక్కి తిరిగి తనని పిలుస్తున్న కొడుకుతో ''నేను రానురా. ఈ హోరు నేను వినాలి అది వినకుండా నేను రాను. రాలేను!'' అంటూ తన వైపుకు వస్తున్న రామ్మూర్తిగార్ని ఒక బలమైన కెరటం తన ఒడిలోకి తీసుకుంది. ఆ కెరటంలో సంధ్య రూపం కనిపించింది రామ్మూర్తిగారికి.

★